క్లుప్తంగా

28న గురుకుల ప్రవేశ పరీక్ష

మరికల్: గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఈ నెల 28న ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనూరాధ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. 11 గంటల నుంచి 1 గంట వరకు జరిగే పరీక్షకు విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నులు, వాటర్ బాటిల్ తదితరాలను వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నారాయణపేట రూరల్ : మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు వివరించారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

లే అవుట్లపై ఆంక్షలు ఎత్తివేయాలి

మరికల్: ప్రభుత్వం గ్రామ పంచాయితీ లే అవుట్లపై ఆంక్షలు ఎత్తివేసి రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వాలని బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అన్సార్ హుస్సేన్ అన్నారు. మరికల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 6 లక్షల మంది రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ప్రభుత్వం లేనిపోని జీవోలు తెచ్చి రియల్ వ్యాపారంను అణిచివేయడం సరికాదన్నారు. అదేవిధంగా ఎల్ఆర్ఎస్, ధరణి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో యాదగిరి, శివాజీ, శ్రీనివాస్, ఆంజనేయులు, యాదయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా పోరాడాలి

మరికల్: ముదిరాజ్‌లను ప్రభుత్వం బీసీ ఏలో చేర్చాలంటే అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ పిలుపునిచ్చారు. మరికల్‌లో గురువారం నిర్వహించిన ముదిరాజ్ సంఘం ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి హక్కులను సాధించుకోవాలన్నారు. అందుకోసం ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. నారాయణ, శేఖర్, కొండప్ప, కృష్ణయ్య, శ్రీను, సత్యన్న, రఘు, కుర్మన్న, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

రాకొండలో 'కంటి వెలుగు' ప్రారంభం

నారాయణపేట టౌన్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు మోనేష్ చారి అన్నారు. గాంధీ నగర్‌లోని సింగార్‌బేస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం శిబిరాన్ని నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని రాకొండలో గురువారం సర్పంచ్ రాజు కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఊట్కూరు: మండలపరిషత్ భవనంలో గురువారం పంచాయతీరాజ్ డైరీని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది కొండయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు సుజాత, అచ్యుతానంద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడలో ఇఫ్తార్

ధన్వాడ: మండల కేంద్రంలోని పెద్ద మసీదులో ప్రభుత్వం తరపున గురువారం ముస్లిం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. సాయంత్రం నమాజ్ అనంతరం ఏర్పాటు చేసిన విందులో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అధికారికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ అధికారి ఒక్కరు కూడా హాజరు కాకపోవడం పై పలువురు విమర్శించారు.

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి

నారాయణపేట రూరల్ : పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకేజీలతో కలుషితమైన టీఎస్‌పీఎస్సీని వెంటనే రద్దు చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీఎన్ఆర్ డీసీ ఎదురుగా నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సిట్ విచారణ నివేదికను బహిర్గతం చేయాలని, సీబీఐ, సిట్టింగ్ జడ్జీతో విచారణ చేపట్టాలన్నారు. లీకేజీ వ్యవహారంలో అధికార బీఆర్ఎస్ నాయకుల జోక్యం లేకుండా చూసుకోవాలని, చైర్మన్, సెక్రెటరీలను తొలగించిన తర్వాతే తిరిగి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇంతియాజ్, చరణ్‌రెడ్డి, గంగాధర్, వివేకానంద, కార్యకర్తలు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



మద్దూర్‌లో ..



మక్తల్‌లో ధర్నా చేపట్టిన నాయకులు

మక్తల్: ప్రభుత్వాలు సొంత స్థలాలు ఉన్నవారికి రూ. పదిలక్షలు ఇంటినిర్మాణం కోసం ఇవ్వాలని, అదేవిధంగా స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రజలకు కనీస సౌకర్యాలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. డివిజన్ కార్యదర్శి భగవంతుఇష్టా జిల్లా అధ్యక్షుడు కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, సీపీఐ నాయకులు రాజు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: బడుగు, బలహీన వర్గాల వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్మాణం చేసి ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ డిమాండ్ చేశారు. ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువారం మద్దూరు తహసీల్దార్ కార్యలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లస్థలాలు లేని వారికి స్థలాలు ఇవ్వాలని, స్థలాలు ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ చింతరవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు కొండ నర్సిములు, ఉషప్ప, గోస్, విజయ్, కార్తీక్, కవిత, భాస్కర్, వెంకట్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రంలో చేపట్టిన ధర్నాలో డివిజన్ కార్యదర్శి సలీం, నాయకులు మల్లేష్, గోవర్ధన్‌రెడ్డి, కనకారాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ తిరుపతయ్యకు వినతిపత్రం అందించారు.

ధన్వాడ: మండలకేంద్రలో నిర్వహించిన ధర్నాలో నాయకులు రాజు, టిర్రప్ప, కతలప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపతహసీల్దార్ గాయత్రికి వినతి పత్రం అందజేశారు.


ఊట్కూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


ధన్వాడలో నిరసన చేపట్టిన నాయకులు

'పాత పెన్షన్ అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే'


మాట్లాడుతున్న తపస్ నాయకులు

కోస్గి: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి ఉద్యోగ విరమణ తర్వాత భద్రత కల్పించే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిన బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్, చత్తీస్‌ఘడ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం వైపు కొనసాగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ దిశగా ఉద్యోగ, ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు అంజిలయ్య, వెంకటేష్, ప్రతినిధులు పరంధాములు, తుల్జారాం, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

ధన్వాడ: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని అమలు పరిచే బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదే అని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ధన్వాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, శేఖర్ అన్నారు. గురువారం స్థానిక విలేకర్లతో వారు మాట్లాడారు.

బసవజయంతి ఘనంగా నిర్వహిద్దాం

నారాయణపేట రూరల్ : బసవేశ్వర జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుందామని వీరశైవ లింగాయత్ – లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు గందె రవికాంత్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కమిటీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించి ఉత్సవ నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం కలెక్టర్ శ్రీహర్షను కలుసుకుని ఆహ్వానపత్రంతో పాటు బసవ జయంతి ఉత్సవాలపై ప్రభుత్వం ఇచ్చిన అధికారిక ఉత్తర్వుల కాపీని బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారీతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా వేడుకలు నిర్వహించే విధంగా ఆదేశాలు ఇస్తామని, కలెక్టరేట్‌లో వేడుకలను ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్‌గందె అనసూయకు ఆహ్వానపత్రాలు అందించారు. సంఘం పూర్వ అధ్యక్షుడు గందె చంద్రకాంత్, ప్రధాన కార్యదర్శి ల్యాబ్ శివకుమార్, ఉపాధ్యక్షులు మల్లికార్జున్, బర్మా నాగభూషణం, కోషాధికారి రవికుమార్, లిఖి రఘుబాబు, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.


కలెక్టర్‌కు ఆహ్వాన పత్రం అందిస్తున్న నాయకులు

ఉపాధ్యాయులను అభినందించిన కలెక్టర్

మరికల్: మండలంలోని గాజులయ్యతాండ ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేసిన హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయుడు నరేష్‌లను కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేకంగా అభినందించారు. గురువారం నారాయణపేటకు వారిని పిలిపించి ముగ్గురు విద్యార్థులు ఉన్న పాఠశాలలో 100కి పైగా విద్యార్థులను చేర్పించడమే కాకుండా పాఠశాల ఆవరణంలో పచ్చని ఆహ్లాదంతో కూడిన వాతావరణాన్ని అభివృద్ధి చేశారని అభినందించి ప్రోత్సహించారు. అదేవిధంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనంగా రెండు గదులను మంజురు చేశారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్


వర్కూర్‌లో కిట్లు అందుకుంటున్న ముస్లింలు


దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

మద్దూరు: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జామా మాజీద్‌లో గురువారం అధికారికి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసినా సమావేశంలో పేద ముస్లింలకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని 7 మందికి లబ్ధిదారులకు వచ్చిన షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మొగులనా కుటుంబానికి పార్టీ నుంచి వచ్చిన రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సలీం, హనిమ్‌రెడ్డి, వీరేష్‌గౌడ్, శివకుమార్, చాంద్‌పాషా, హబీబ్, షేక్ అహ్మద్, సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ వెంకటయ్య, ఎంఎంసీ చైర్మన్ వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని వర్కూర్‌లో గురువారం స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో రంజాన్ కిట్లను సర్పంచ్ నిర్మలమ్మ , వైస్ ఎంపీపీ దుల్లా తిప్పయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత సామరస్యానికి, సోదర భావానికి రంజాన్ పండుగ ప్రతీక అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లారెడ్డి, ఉపసర్పంచ్ పోర్ల కృష్ణయ్య, వార్డు సభ్యులు బైని రాము, అశోక్, లింగప్ప, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

వర్కటం ఆధ్వర్యంలో..

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల, పగిడిమర్రి గ్రామాల్లో ముస్లింలకు గురువారం రంజాన్ కిట్లను వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 500 కుటుంబాలకు రంజాన్ సందర్భంగా సొంత ఖర్చులతో కిట్‌లను అందించామని పేర్కొన్నారు. నాయకులు మైబూబ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కోస్గి: పండుగలు మత సామరస్యానికి ప్రతీకలని కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని గురువారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పేదలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


కాంగ్రెస్ ఆధ్వర్యంలో కిట్ల పంపిణీ


పగిడిమర్రిలో కిట్లను అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

విద్యార్థులకు అవగాహన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ సుధామాధురి

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం విశ్వనాథ్ సమక్షంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ సుధామాధురి విద్యార్థులకు పలు అంశాల గురించి వివరించారు. బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, సెల్‌ఫోన్ ఎక్కువగా వాడటం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోకుండా సృజనాత్మక విషయాలు నేర్చుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సునీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె


మక్తల్‌లో మాట్లాడుతున్న గోవింద్‌రాజ్

మక్తల్: పట్టణంలో వీఓఏలు నిర్వహిస్తున్న సమ్మెకు సీఐటీయూ నాయకులు గురువారం మద్దతు పలికారు. మండల కన్వీనర్ గోవింద్‌రాజు, జ్యోతి, చంద్రకళ, వెంకట్‌రాములు, బాలయ్య, రాంరెడ్డి, రాజు, రాము, సంతోష, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల పరిధిలో వీఓఏల సమ్మె కొనసాగుతోంది. గురువారం నాల్గోరోజు సీపీఎం నాయకులు సమ్మెలో కూర్చుని వీఓఏలకు మద్దతు పలికారు. పార్టీ సీనియర్ నాయకుడు భరత్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో సంఘాలకు పునాది వంటి వారు వీఓఏలని అన్నారు. పనికి సమాన వేతనం రూ. 26 వేలు వారికి అందజేయాలని, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ఆంజనేయులు మాట్లాడుతూ.. నిరంతరం సంఘాల అభివృద్ధికి వీఓఏలు కృషిచేస్తున్నారని అన్నారు. నాయకులు వాకిటి వెంకటయ్య, నరేష్, వీఓఏల సంఘం నాయకులు బాబు, విష్ణు, మారుతి, వెంకటమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: వీఓఏల సమ్మెకు జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు గురువారం మద్దతు పలికారు. ప్రభుత్వం గుర్తించి వారికి న్యాయం చేయాలన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహా, రమేష్‌రెడ్డి, సంజీవ్, చంద్రమోహన్, రహీం, మహిపాల్‌గౌడ్, చంద్రప్ప, ప్రజాపంథా నాయకులు కాశీనాథ్, నర్సిములు, విజయ్, కార్తిక్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

నారాయణపేట టౌన్ : రాష్ట్రంలో టీడీపీ బలోపేతమే లక్ష్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. జిల్లాకేంద్రలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి మాట్లాడారు. ఆలయాల్లో నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఓం ప్రకాశ్, ధన్వాడ మండల రహీమ్, యాబన్న చౌద్రి పాల్గొన్నారు.

కోస్గి: స్థానిక శివాజీ చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు డీకే రాములు, వెంకట్ ప్రసాద్, అమృత్‌రెడ్డి, అచ్యుతారెడ్డి, వెంకటయ్య, అంబదాస్, రాజు, సాయిలు, శ్రీనివాస్ తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలో నిర్వహించిన వేడుకల్లో కందెన్‌పల్లి ఉప సర్పంచ్ రాములు యాదవ్, తిమ్మారెడ్డి, వీరన్న గౌడ్, నాగయ్య, రంగయ్య, బస్సప్ప, శ్రీనివాస్‌గౌడ్ బస్వరాజ్‌లు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

కృష్ణా: బసవ జయంతి సందర్భంగా గుర్జాల్ కాడ్ లింగేశ్వర, ఐనాపూర్ బసవేశ్వర బ్రహ్మోత్సవాలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉత్సవాల నిర్వహణపై విలేకరులతో మాట్లాడారు. ఉదయం ఆలయాల్లో రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, మహా మంగళహారతితో పాటు అగ్నిగుండం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం 6 గంటలకు రథోత్సవం ఉంటుందని ముఖ్య అతిథులుగా బంధ్‌నాశ్ పీఠాధిపతి వృషభ లింగేశ్వర మహాస్వామి, బాడియాల్ పీఠాధిపతి చెన్నవీర శివాచార్య మహాస్వామి, నేరడగం పీఠాధిపతి పంచమ సిద్ధలింగ మహాస్వామి హాజరవుతున్నట్లు వివరించారు. ఇప్పటికే ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సర్పంచ్‌లు దేవేంద్రప్పగౌడ, రమేష్ వివరించారు.


ఉత్సవాలకు సిద్ధమైన కాడ్ లింగేశ్వర ఆలయం

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

మాగనూర్: మన వాగు– మన ఇసుక పేరుతో ప్రభుత్వ అనుమతులతో జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి రెవెన్యూ రావాలి , ప్రజలకు ఉపాధి లభించాలనే లక్ష్యంతో మండల పరిధిలోని నాలుగు ఇసుక రీచ్‌లు నడిపిస్తుంటే కొందరు అక్రమార్కులు ఇదే అదనుగా తమ జేబులు నింపుకొనే ప్రయత్నం చేస్తున్నారు. రాత్రి సమయంలో ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ మీదుగా నిత్యం ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.ముఖ్యంగా మండలంలోని అచ్చంపేట, పెగడబండ గ్రామాల నుంచి మాగనూర్‌తో పాటు కృష్ణ మండల పరిధిలోని గూడెబల్లూర్, టైరోడ్డు, కున్సి, చేగుంట తదితర గ్రామాలకు ఇసుక అక్రమంగా తరలించుకుపోతున్నారు. కాగా ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపైనా పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయంపై స్థానిక ఆర్ఐ శ్రీశైలంను గురువారం వివరణ కోరగా.. ఆయా గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని అన్నారు. స్థానికంగా ఉన్న వీఆర్ఏలతో డ్యూటీ ఏర్పాటు చేసి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు

నారాయణపేట రూరల్ : జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో గురువారం అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తరనామావళి, అభిషేకం , అలంకరణ, హారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేపట్టారు. అదేవిధంగా పట్టణంలోని అయ్యప్ప స్వామి, సింగార్‌బేస్ శివలింగేశ్వర స్వామి దేవాలయం, మహంకాళివీధి శివాలయం, తాయమ్మగుడితో పాటు మండలంలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప ఆలయం, జిలాల్‌పూర్ కర్రెప్పతాత గుడిలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటి చైర్మన్ జ్యోతి, సర్పంచులు జమునాబాయి, సాయిరెడ్డి, రామ్మోహన్, ఎంపీటీసీ రాంరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు వేపూరిరాములు, వీరశైవ సమాజం పెద్దలు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో కాలబెలగుందీశ్వరుడు

మక్తల్: అమావాస్య సందర్భంగా పట్టణంలోని ఆలయాల్లో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి మక్తల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా రాయిచూర్ రోడ్డు వద్ద పాదయాత్ర స్వామి రాజు అన్నదానం చేశారు. భక్తులు అశోక్, అనిల్, అనిల్‌గౌడ్, శివారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

దామరగిద్ద: రైతుబీమా మంజూకురు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ధ్రువపత్రాలను అధికారి కోస్గి ఏడీఏ శ్యామ్యుల్ జాన్ బృందంతో కలిసి బుధవారం మద్దెల్‌బీడ్‌లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గ్రామానికి చెందిన గౌర్రె బాలప్ప ఇటీవల మృతి చెందగా రైతుబీమా మంజూరుకు కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా సంబంధితపత్రాలను అధికారులు పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి అరవింద్, ఏఈఓ శివజ్యోతి, సర్పంచ్ వెంకటప్ప, మాజీ సర్పంచ్ బాలప్ప, గ్రామ పెద్దలు గౌర్రె భగవంతు పాల్గొన్నారు.

కాచ్‌వార్‌లో వైద్యశిబిరం

మక్తల్: కాచ్‌వార్‌లో గురువారం పల్లె దవాఖానా కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామీణా ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందించేందుకు దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. కాచ్‌వార్, లింగంపల్లి, నర్సిరెడ్డిపల్లి, టేకులపల్లి తదితర గ్రామాలు తమ పల్లె దవాఖాన పరిధిలో ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, వైద్యురాలు శోభారాణి, పద్మమ్మ, గ్రామస్తులు మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి వేసవి శిక్షణ శిబిరం

నారాయణపేట రూరల్ : చదువుతో పాటు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకశక్తి, సాంస్కృతిక కళలను బయటకు తీయడానికి బాలకేంద్రం ఎంతో ఉపకరిస్తుందని సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా పట్టణం, చుట్టుపక్కల గ్రామాల చిన్నారులను ఎంతో మందిని చక్కటి కళాకారులుగా తీర్చి దిద్ది రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపిన చరిత్ర బాలకేంద్రానికి ఉందన్నారు. ఏటా వేసవిలో నిర్వహించే శిబిరం ఈసారి సైతం బాలకేంద్రం చైర్మన్, కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి 41రోజుల పాటు జరుగుతుందన్నారు. మినీ స్టేడియం గ్రౌండ్‌లోని బాలభవన్‌లో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. గాత్రం, నృత్యం, చిత్రలేఖనం, సితార్, తబల తదితర అంశాలపై ఆసక్తి కల్గిన చిన్నారులు రూ.50 అడ్మిషన్ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. శిక్షణ అనంతరం ప్రశంసాపత్రాలను అందిస్తామన్నారు. వివరాలకు సెల్ 9000620181ను సంప్రదించాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని ఆహ్వానిస్తున్న నాయకులు

ఊట్కూరు: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపల్లిలో పార్టీ నాయకుడు మేస్త్రీ హనుమంతు(40) అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతిచెందిన విషయం తెలుసుకుని గ్రామానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటానని, ప్రభుత్వ ఆర్థికసాయం అందేవిధంగా కృషి చేస్తానని భరోసానిచ్చారు.

బీఆర్ఎస్‌లో చేరిక

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్‌లో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఊరుముందర బుజ్జప్ప గురువారం స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలతో పాటు గ్రామాల్లో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ దుల్లా తిప్పయ్య, మాజీ సర్పంచ్ మారెప్ప, నాయకులు మల్లారెడ్డి, దయ్యాల వెంకటప్ప, ఈశ్వర్‌యాదవ్, పండుగ సాయన్న పాల్గొన్నారు.

బండారు ఉత్సవాలకు ఆహ్వానం

మాగనూర్: మండలంలోని వర్కూర్‌లో ఈ నెల 28న నిర్వహించనున్న బీరప్ప బండారు ఉత్సవాలకు సంబంధించి గురువారం బీరప్ప సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఏడాదే ఉత్సవాలు జరగాల్సి ఉన్నా కరోనా వల్ల వాయిదా వేశామని వివరించారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నర్వ: మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషిచేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మైనార్టీలకు రంజాన్ కిట్లను ఆయన అందించారు. ఈ సందర్భంగా 250 మందికి కిట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ గౌనిజ్యోతి, వైస్ ఎంపీపీ వీణావతి, రైతు సమితి మండల కోఆర్డినేటర్ చిన్నయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.